క్లుప్తంగా

విత్తమేళాను సద్వినియోగం చేసుకోండి

తాడూరు: జిల్లాలోని పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శుక్రవారం నిర్వహించే విత్తన మేళాను ఆయా గ్రామాల రైతులు పాల్గొని వినియోగించుకోవాలని ఏఓ సాయిరమేష్‌కుమార్ తెలిపారు. వరి ఆర్‌ఎన్‌ఆర్ 15048, వరి కేఎన్‌ఎం 1638, కంది పీఆర్‌జీ 176 రకం, ఉలువలు, మినుములు, పెసర, ఉముదం, పచ్చజొన్న, తెల్లజొన్న, రాగి, సజ్జ, కొర్ర, వేరుశనగ వంటి 13 రకాల విత్తనాలు విక్రయానికి అందుబాటులో ఉన్నాయని రైతులు పాల్గొని శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచనలు, సలహాలను పాటించాలన్నారు.

వార్షికోత్సవ సన్నాహక సమావేశం

ఉప్పునుంతల: మండలకేంద్రంలో జూన్ 1న నిర్వహించే బొడ్రాయి ప్రతిష్ఠ వార్షికోత్సవంపై సన్నాహక సమావేశాన్ని గురువారం ఉదయం స్థానిక కేదారేశ్వరాలయంలో నిర్వహించారు. ఉదయం బొడ్రాయి వద్ద పూజల అనంతరం కేదారేశ్వరాలయంలో హోమం, ఇతర పూజలు, అదేవిధంగా గ్రామ దేవతలైన కోట మైసమ్మ, పోచమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించుకోవడం జరుగుతుందని సమావేశంలో చర్చించారు. మరుసటి రోజు ఆదివారం పెద్ద ఆర్భాటాలకు పోకుండా విందులు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలో కొత్తగా వారాంతపు సంతను నిర్వహించడంపై చర్చించారు. కార్యక్రమంలో అర్చకుడు శ్రీనివాస్‌శర్మ, గ్రామపెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయండి



పెంట్లవెల్లి: మండలంలోని కొనుగోలు కేంద్రాలలో వరి కొనుగోలు ధాన్యాన్ని వేగవంతం చేయాలని తహసీల్దార్ హిమబిందు గురువారం పలు కొనుగోలు కేంద్రాలు ఆమె తనిఖీ చేశారు. ప్రతి రైతు వద్ద ధాన్యాన్ని పరీక్షించి కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి విషయం ఆన్‌లైన్‌లో, రికార్డులో భద్రపర్చాలని వారికి తెలియజేశారు.

చెంచులకు ఆహార ధాన్యాల పంపిణీ



లింగాల: మండలంలోని ఎర్రపెంటలో గురువారం నైస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100 చెంచు కుటుంబాలకు నెలకు సరిపడు ఆహార ధాన్యాలు, 15 రకాల న్యూట్రిషన్ ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. ఫౌండేషన్ కార్యదర్శి పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ పెంటను 5 ఏళ్ల వరకు దత్తత తీసుకొని పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

హెచ్‌ఎంగా బాధ్యతల స్వీకరణ

తెలకపల్లి: మండలంలోని కార్వంగ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన కృష్ణయ్య స్థానంలో అదే పాఠశాలలో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయురాలు షన్వాజ్‌బేగం హెచ్‌ఎంగా నియమించినట్లు ఎంఈఓ చంద్రుడు తెలిపారు. ఎంఈఓ చేతుల మీదుగా ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు.

అసంపూర్తిగా మహిళా సమాఖ్య భవనం



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనానికి నిధులు లేక అసంపూర్తిగా నిర్మాణం చేపట్టి వదిలిపెట్టారు. ప్రస్తుతం కార్యాలయంలో బండలు లేకపోవడంతో కవర్లు వేసి సమావేశాలు నిర్వహిస్తున్నారు. తలుపులు, కిటికీలు లేకపోవడంతో కార్యాలయం సిబ్బంది ఇబ్బందులకు గురి అవుతున్నారు. జిల్లా అధికారులు పట్టించుకుని నిధులు మంజూరు చేయాలని సంఘాల సభ్యులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అమ్రాబాద్: పదరలో కాంగ్రెస్ కార్యకర్త పణ్యమూర్తి వెంకటయ్య(52) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ వెంకటయ్య మృతి పార్టీకి తీరని లోటని ఆయన కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట రామలింగయ్యయాదవ్, ప్రవీణ్‌కుమార్, అలరాజు తదితరులు ఉన్నారు.

సబ్‌స్టేషన్ పూర్తయ్యేనా?



వెల్దండ మండలం పోతేపల్లిలో అసంపూర్తిగా ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

- అసంపూర్తిగా పనులు
- లోఓల్టేజీతో మరమ్మత్తులకు గురవుతున్న మోటార్లు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు

వెల్దండ: రైతులకు లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేసింది. దీంతో రైతులకు కష్టాలు తీరిపోతాయని సంతోషం వ్యక్తం చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో సబ్‌స్టేషన్ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. మండలంలోని పోతేపల్లిలో లోఓల్టేజీ సమస్య తీర్చేందుకు 2018లో 33.11కెవీఏ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించేందుకు రూ.1.20కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో పోతేపల్లి, లింగారెడ్డిపల్లి, దొడ్లపల్లి, బుడోనిపల్లి, ఎంజీతండా, అల్లంతోటబావితండా, పోషమ్మతండా తదితర గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేశారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి కాంట్రాక్టర్లు పనులు దక్కించుకొని ప్రారంభించారు. కొంత వరకు పూర్తి చేసినా అర్ధాంతరంగా నిలిపివేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు, సబ్‌కాంట్రాక్టర్‌కు ఇద్దరి మధ్య బిల్లుల సమస్యలు వచ్చి పనులు మధ్యలో నిలిపివేశారు. దాదాపుగా పనులు నిలిచి ఏళ్లు గడుస్తున్న నేటికి పూర్తి కాలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రాస్తులు, రైతులు అనేక సార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదన్నారు.

లోఓల్టేజీ సమస్య

వర్షకాలంలో కల్వకుర్తి ఎత్తిపోథల పథకం ద్వారా కేఎల్ఐ కాల్వ ద్వారా నీరు వస్తుంది. దీంతో రైతులు పంటలను అధిక సంఖ్యలో సాగుచేశారు. విద్యుత్ వినియోగం అధికం కావడంతో తరుచుగా లోఓల్టేజీతో మోటార్లు మరమ్మత్తులకు గురవుతున్నాయి. దీంతో అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏళ్లుగా ఎదురుచూసిన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు పూర్తి కాలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పనులను పూర్తిచేసి రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నారు.

దెబ్బతింటున్న మోటార్లు



సబ్‌స్టేషన్ పూర్తి కోసం ఏళ్లు ఎదురుచూస్తున్నాం. వర్షకాలంలో లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉంటుంది. దీంతో బోరు మోటార్లు మరమ్మతులకు గురవుతున్నాయి. సాగుచేసిన పంటలు చేతికందే సమయంలో ఎండిపోతున్నాయి. అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదు.

– కొండల్‌యాదవ్, రైతు, పోతేపల్లి

త్వరలోనే పూర్తిచేస్తాం



పోతేపల్లిలో అసంపూర్తిగా ఉన్న సబ్‌స్టేషన్ పనులను త్వ రలోనే పూర్తి చేయిస్తాం. సంబంధిత కాంట్రాక్టర్లను సంప్రదించి పనులను వేగవంతం చేస్తాం. రైతులకు లోవోల్టేజీ సమస్యను ఉన్న మాట వాస్తవం. కేఎల్ఐ కాల్వ రావడంతో విద్యుత్ మోటార్లు పెరగడంతో సమస్య ఎక్కువైంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులను పూర్తి చేసి రైతుల సమస్యను పరిష్కరిస్తాం.

– సూర్యం నాయక్, ఏఈ, వెల్దండ

శిక్షణ ఏఎస్‌ఓల బృందం పర్యటన



తెలకపల్లిలో ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్న శిక్షణ ఏఎస్‌ఓల బృందం

తెలకపల్లి: మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం నియమించిన శిక్షణ ఏఎస్‌ఓల బృందం గురువారం 4వ రోజు గురువారం ఆయా కార్యాలయాలను సందర్శించి వివరాలు సేకరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వారు సర్వే నిర్వహించారు. అమలు తీరు, ఎదురయ్యే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ తాగునీటి సరఫరా, మిషన్ భగీరథ అసిస్టెంట్ ఇంజినీర్లతో వాటి పనితీరుపై వివరాలు సేకరించారు. చౌకధరల దుకాణాన్ని సందర్శించి డీలర్ల ద్వారా నిత్యావసర సరుకుల వివరాలు సేకరించారు. కామన్ సర్వీస్ సెంటర్‌ను సందర్శించి ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతుందో సమాచారం సేకరించినట్లు బృందం తెలిపింది.

తాడూరు: మండలంలోని అల్లాపూర్‌లో శిక్షణ ఏఎస్‌ఓలు గురువారం మహిళా సంఘాలతో కలిసి వారి జీవన విధానం వారు, ఎలా అభివృద్ధి చెందుతున్నారనే విషయాలతోపాటు అంగన్‌వాడీ టీచర్లు నిర్వహించే కార్యక్రమాలు, ప్రభుత్వం అందించే పౌష్టికాహారం వంటి వివిధ అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు పరిశీలించి పరిశుభ్రత, కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన ఆట వస్తువులు వారికి అందించే బాలామృతం, పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను పరిశీలించారు. అంగన్‌వాడీ ఎదుట గ్రామ పటాన్ని ఏర్పాటు చేసి రోడ్లు, ఇళ్లు, దేవాలయాలు, డ్రైయినేజీలు, మరుగుదొడ్లు ఎలా ఉండాలి అన్న విషయాలను తెలియజేశారు. మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందించే రుణాలు తిరిగి వాటిని ఏవిధంగా వసూలు చేస్తున్నారు. ఆ డబ్బుతో ఏవిధంగా అభివృద్ధి చెందారు. వారి జీవన విధానం వంటి అంశాలను వారికి తెలియజేస్తూ వారితో సభ్యులు అర్థమయ్యే రీతిలో తెలుసుకున్నారు. వారి వెంట ఏపీడీ శ్రీనివాసులు, కార్యదర్శి వినోద్, శిక్షణ ఏఎస్‌లు దీపక్, అజిత్‌కుమార్, ఉజ్వల్‌సంగం, ఆదిత్యస్వరూప్, ప్రమీజ్‌కుమార్ వర్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

చారకొండ: మండలంలోని మర్రిపల్లికి చెందిన నాయకులు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణను గురువారం క్యాంపు కార్యాలయంలో కలిశారు. గ్రామంలో వివిధ సమస్యలపై, అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. నాయకులు కొండల్, విష్ణు, రాజు నాయక్, రాజు, లాలు నాయక్, మల్లేష్, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

'హత్యా రాజకీయాలు తగదు'

కల్వకుర్తిరూరల్: అధికార పార్టీ నాయకులు హత్యారాజకీయాలకు తెర తీయడం మంచి పద్ధతి కాదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌గౌడ్, మాజీ సర్పంచ్ జంగయ్య వేర్వేరు ప్రకటనలో తెలిపారు. వనపర్తి జిల్లాకు చెందిన శ్రీధర్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక హత్య చేశారని ఆరోపించారు. హత్య వెనుక ఉన్నవారితోపాటు హత్యకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

పాన్‌గల్: వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతున్న కారణంగా సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలను చైతన్యం చేస్తూ సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతల ఆరోగ్య విషయాలు, కాన్పుల సంఖ్య, టీబీ, లెప్రసీ, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డుల నమోదు తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రతి కాన్పు పీహెచ్‌సీలో చేసేలా చూడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. సిబ్బందికి కేటాయించిన గ్రామాల్లో అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని, విధులపై అలసత్వం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



ఉప్పునుంతలలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్

ఉప్పునుంతల: మండల కేంద్రంతో పాటు మొల్గర, పెద్దాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం తహసీల్దార్ శ్రీకాంత్ తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు, తూకాలు తదితర విషయాలను పరిశీలించారు. మరో రెండు రోజుల్లో కొనుగోలు పూర్తి చేయాలని పీఏసీఎస్ సీఈఓ రవీందర్‌రావుకు సూచించారు. రైతులు ఆలస్యం చేయకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకుని ప్రభుత్వం కల్పించిన గిట్టుబాటు ధర పొందాలని తహసీల్దార్ సూచించారు. ఇప్పటివరకు ఆయా కేంద్రాల్లో 880 మంది రైతులకు సంబంధించిన 58,516 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

బల్మూర్: రైతుల నుంచి సేకరిస్తున్న వరి ధాన్యం కొనుగోళ్లు రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా ఉండాలని తహసీల్దార్ శైలేంద్రకుమార్ సూచించారు. మండలంలోని కొండనాగుల ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తుమ్మెన్‌పేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సాయంత్రం తహసీల్దార్ తనిఖీ చేశారు. వరి ధాన్యం తేమ శాతం, కొనుగోలు కేంద్రంలో రైతులకు కల్పిస్తున్న వసతులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎలాంటి ఇబ్బందులు, అవకతవకలు కాకుండా ధాన్యం సేకరించాలని నిర్వాహకులకు సూచించారు.

బుద్ధుడి బోధనలు శాంతికి చిహ్నాలు



జిల్లా కేంద్రంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సభ్యులు

నాగర్‌కర్నూల్: శాంతికాముకుడు విశ్వమానవాళి ఆదర్శనీయుడు బుద్ధుడి బోధనలు శాంతికి చిహ్నాలని ఆయన చిరస్మరణీయుడని పట్వారీల సంఘం మాజీ అధ్యక్షుడు ప్రసాదరావు అన్నారు. గురువారం మండలంలోని వనపట్ల పంచాయతీలో బుద్ధ గీత కావ్య వాల్ పోస్టర్లు ఆవిష్కరణ చేశారు. బుద్ధ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బుద్ధుడి ధర్మ బోధనలను వ్యాప్తి చెందాల్సిన అవసరముందన్నారు. వనపట్ల గ్రామానికి చెందిన కవి వనపట్ల సుబ్బయ్య మహా సంకల్పంతో తన సొంత కృషితో రచనలు చేస్తూ గ్రామాన్ని రెండు రాష్ట్రాలలో పేరు తెచ్చిన వ్యక్తి అని కొనియాడారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో గురువారం గౌతమ బుద్ధుడి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఐడియలాజి మిషన్ అధ్యక్షుడు మద్దిలేటి ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన గొప్పతనాన్ని వివరించారు. ప్రపంచశాంతికి మానవజీవన దుఖః నివారణకు హేతుబద్ధతతో కూడిన మార్గాన్ని చూపిన మహాసుభావుడని ప్రపంచ మొదటి గురువని పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున్, రాములన్న, మద్దిలేటి, గోవర్దన్, వెంకటస్వామి, సాయిబాబు, జ్ఞానేశ్వర్, క్రాంతి, రవి, శ్యాం, రాములు, కృష్ణప్రసాద్, రాములు తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని పలు సంఘాల ఆధ్వర్యంలో బుద్ధ జయంతిని గురువారం నిర్వహించారు. మహనీయుల స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ కోచింగ్ సెంటర్‌లో జయంతిని నిర్వహించారు. బహుజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ బుద్ధుడి గురించి విద్యార్థులకు వివరించారు.



జిల్లా కేంద్రంలో నివాళులు అర్పిస్తున్న సభ్యులు



అచ్చంపేటలో బుద్ధ జయంతిలో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



బైరాపూర్‌లో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వంగూరు: మండల కేంద్రంలో లక్ష్మీనర్సింహ్మస్వామి కల్యాణమహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పురోహితుల వేదమంత్రాలు, బాజాభజంత్రీల మధ్య కల్యాణం కనులపండువగా జరిగింది. భక్తులు ఆలయంలో స్వామివారిని దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వెల్దండ: మండలంలోని బైరాపూర్ లక్ష్మీ నరసింహ స్వామి వారి కల్యాణోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామిని ఊరేగింపు నిర్వహించారు. దేవాలయ ఆవరణంలో స్వామి వారికి కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గురువారం ఉదయం పుష్పయాగం చేశారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా గురువారం ఆలయ ఆవరణలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. ఇక నుంచి ప్రతి నెల పౌర్ణమి రోజున వ్రతాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు రామాచారి తెలిపారు.

సామూహిక వ్రతాలలో పాల్గొన్న భక్తులు

కూలీల సంఖ్య పెంచండి



లింగాలలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ

లింగాల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచి పనులు చేయించాలని ఎంపీడీఓ ఆంజనేయులు సూచించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పనులు తదితర వాటిపై గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. సెగ్రిగేషన్ షెడ్‌లో ఎరువుల తయారీ, క్రిమిటోరియం, పల్లె ప్రకృతి వనాలను శుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందికి సూచించారు. ఎన్‌ఎంఎస్ యాప్‌లో కూలీల హాజరును నమోదు చేయించాలని, మస్టర్ల కార్యదర్శులు సంతకాలు చేయాలని, మొక్కలకు ట్యాంకర్ల ద్వారా నీటిని పట్టించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీఓ కర్ణనాయక్, ఏపీఓ ఇమాం అలీ, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పనులు..

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాలలో జాతీయ ఉపాధిహామీ పథకం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గ్రామాలలో కొత్తగా పనులకు వెళ్లే కూలీలు జాబ్‌కార్డులను పొంది ఉండాలని ఏపీఓ మంజుల సూచించారు.

యూనిఫాం సకాలంలో అందించాలి



తెలకపల్లిలో మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రుడు

తెలకపల్లి: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో గురువారం ఎంఈఓ చంద్రుడు మహిళా సంఘాల సభ్యులతో, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు యూనిఫాం కుట్టేందుకు తీర్మానం చేశారు. ఈ విద్యా సంవత్సరం పాఠశాలలు ప్రారంభమైననాటికి అందించాలన్నారు. ఈ దిశగా ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు చొరవ తీసుకొని సమయానికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం బాలస్వామి, మల్లికార్జున్, ప్రతినిధులు నిరంజన్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: విద్యార్థుల యూనిఫామ్‌ను సకాలంలో అందించాలని ఎంఈఓ బాలకిషన్ సూచించారు. మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులకు వచ్చిన దుస్తులను గురువారం టైలర్లకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుస్తులు కొలతలు తప్పకుండా, నాణ్యవంతంగా కుట్టివ్వాలని సూచించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల అదుపు



అప్పాయపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ జగన్‌మోహన్

లింగాల: నేరాలను సకాలంలో అదుపు చేయడం, నేరస్తులను గుర్తించడంలో సీసీ కెమెరాలు దోహదపడుతాయని ఎస్‌ఐ జగన్‌మోహన్ అన్నారు. గురువారం మండలంలోని అప్పాయపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించే వారిని, నేరాలు చేసే వారిని సకాలంలో గుర్తించేందుకు కెమెరాలు ఎంతో అవసరమని అన్నారు. గ్రామంలో ముఖ్యమైన కూడళ్లలో కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, అందుకు ప్రజలు ఆర్థిక వనరులు సమకూర్చాలని ఎస్‌ఐ కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ శ్రీనివాసులు, హెచ్‌సీ నాను, హోంగార్డులు ఉస్సేన్, కుమార్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ఉప్పునుంతల: మండలంలో పత్తి తదితర పంటలకు చెందిన నకిలీ విత్తనాలు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఏఓ సునీత గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు రుజువైతే ట్రేడర్ షాపు లైసెన్స్ రద్దు చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తిరూరల్: తమతోపాటు చదువుకున్న బాల్య మిత్రుడు అకాల మరణం చెందడంతో తోటి స్నేహితులు కుటుంబానికి ఆసరాగా నిలిచారు. వెల్దండ మండలం, పోతేపల్లికి చెందిన గోవర్దన్ కల్వకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నాడు. గురువారం మిత్రబృందం రూ.17,500 నగదు, క్వింటాల్ బియ్యాన్ని కుటుంబానికి అందించి రాబోయే రోజుల్లో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

కొల్లాపూర్: చిన్నంబావి మండలం లక్ష్మీపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బొడ్డు శ్రీధర్‌రెడ్డిని హత్యచేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ముదిరాజ్ సంఘం నాయకుడు కట్టా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాజకీయాల్లో సౌమ్యుడిగా పేరున్న శ్రీధర్‌రెడ్డిని దారుణంగా హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

నాగర్‌కర్నూల్‌రూరల్: కుమ్మెర మాజీ సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి గురువారం మృతి చెందినట్లు ఆ గ్రామ సర్పంచ్ శ్రీదేవి గురువారం ప్రకటనలో తెలిపారు. వేణుగోపాల్‌రెడ్డి 50 ఏళ్ల పాటు విద్యాభివృద్ధికి కృషి చేశారని, అదేవిధంగా కుమ్మెర గ్రామానికి సర్పంచ్‌గా వ్యవహరించి విశిష్ట సేవలు అందించారని తెలిపారు. 98 ఏళ్లు గడిచిన ఆరోగ్యంగా ఉంటూ అకస్మికంగా చనిపోయారని ఆయన మృతిపై పలువురు విద్యావేత్తలు, రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

సైకిల్, బైక్ ఢీ : ఒకరికి గాయాలు

తెలకపల్లి: సైకిల్, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన రాములు గురువారం రాత్రి 10 గంటల ప్రాంతంలో సైకిల్‌పై బస్టాండ్ నుంచి ఇంటికి వెళ్తుండగా నెహ్రూ చౌరస్తా వద్ద నాగర్‌కర్నూల్ వైపు నుంచి వచ్చిన బైకు సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కిందపడ్డారు. బైక్‌పై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, సైకిల్‌పై ఉన్న రాములుకు స్వల్ప గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వ్యక్తిని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.